సాక్షి
మంచిర్యాల
సోమవారం । 26 । జూన్ । 2023



డ్రోన్‌తో మందు స్ప్రే

వ్యవసాయంలో డ్రోన్ వినియోగం పెరుగుతోంది. తక్కువ ఎత్తు పెరిగే వివిధ రకాల పంటలకు రసాయన, పురుగు మందులను వీటితో పిచికారీ చేయొచ్చు. 8లో▸

అలవెన్స్‌ల పెంపుపై హర్షం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, ఇతర అలవెన్స్‌ల పెంపు ఉత్తర్వులపై టీఎన్జీవోస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో శ్రీహరి పాల్గొని మాట్లాడారు. సమావేశంలో కేంద్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, జిల్లా కార్యదర్శి రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
29.0 /25.0

వాతావరణం

వాతావరణం చల్లబడనుంది. ఆకాశం మేఘావృతమై ఉండి పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాలో 11.5 మి.మీ. వర్షపాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో శనివారం నుంచి ఆదివారం వరకు 11.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బెల్లంపల్లిలో 31.1మి.మీ, కాసిపేటలో 32.4మి.మీ, నెన్నెలలో 27.9మి.మీ, తాండూర్‌లో 27.1 మి.మీ, భీమినిలో 13.3మి.మీ, కన్నెపల్లిలో 13.3 మి.మీ, భీమారంలో 20.7 మి.మీ, చెన్నూర్‌లో 17.5 మి.మీ, కోటపల్లిలో 10.6 మి.మీ, వేమనపల్లిలో 6.2 మి.మీ, మందమర్రిలో 1.8మి.మీ, జైపూర్‌లో 3.2 మి.మీ, నస్పూర్‌లో 1.1మి.మీ, మంచిర్యాలలో 0.6మి.మీ వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు జిల్లా సాధారణ వర్షపాతం 131.3 మిల్లీమీటర్లు కాగా 48.2 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసింది. 63 శాతం లోటుగా ఉంది.

అవధానం అద్భుత సాహిత్య క్రీడ



మాట్లాడుతున్న పట్వర్ధన్

మంచిర్యాలఅర్బన్: అవధానం అనేది మంచి సాహిత్య క్రీడ అని శతావధాని ఎంవీ పట్వర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో 113వ అష్టావధానం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటి వరకు మూడు శతావధానాలు, 112 అష్టావధానాలు విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు. మల్లప్ప వసంత్‌శర్మ సంచాలకులుగా వ్యవహరించిన కార్యక్రమంలో కవులు, రచయితలు వామన్‌రావు, అల్లాడి శ్రీనివాస్, శ్రీనాథ్, చంద్రశేఖర్, బ్రహ్మయ్య చౌదరి, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న వెంకట్

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. మంచిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలకు రంగులు కాదు.. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అప్పటి వరకు విద్యావలంటీర్లను నియమించాలన్నారు. కోర్టు కేసు క్లియర్ చేయించి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు బేసిక్ పే ఇవ్వాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోళ్ల రామన్న, రాజా వేణు, ఉపాధ్యక్షురాలు లావణ్య, కోశాధికారి కిరణ్, కార్యదర్శులు చంద్రమౌళి, దేవదాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీలో పలువురి చేరిక



యూనియన్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న ప్రేమ్‌సాగర్‌రావు, జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పలువురు కార్మికులు ఐఎన్టీయూసీలో చేరారు. యూనియన్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ హాజరయ్యారు. టీబీజీకేఎస్ నాయకుడు రావుల అనిల్ ఆధ్వర్యంలో సుమారు 250 మంది యూనియన్‌లో చేరగా వారికి నేతలిద్దరూ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిలోని బొగ్గు బ్లాకులను వేలం వేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఉన్న గనుల్లో పనులన్నీ ప్రైవేటుపరం చేస్తుందన్నారు. రాబోయే సింగరేణి ఎన్నికల్లో ఐఎన్టీయూసీ, అనంతరం జరిగే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షులు రాజమౌళి, ధర్మపురి, నాయకులు స్వామి, నరేందర్, భీంరావు శ్యాం, భూమయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



దుక్కి దున్నుతున్న రైతు

పదో సాయం..

- రైతుబంధుకు వేళాయె
- నేటి నుంచి అన్నదాత ఖాతాల్లోకి..
- విడతల వారీగా పెట్టుబడి సాయం
- 15 రోజుల వ్యవధిలో జమ
- జిల్లాలో 1.46లక్షల మందికి రూ.166.33 కోట్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతుబంధు పథకంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం అన్నదాతకు ఏటా రెండుసార్లు పెట్టుబడి సాయం అందిస్తోంది. ఇందులో భాగంగా ఈ వానాకాలం సాగుకు సంబంధించి పదో విడతను నేటి నుంచి వారి ఖాతాల్లో జమ చేయనుంది. ఏటా వానాకాలం, యాసంగికి రైతులకు పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.5వేల చొప్పున అందజేస్తుంది. ఈ సీజన్‌కు సంబంధించి నేటి నుంచి వచ్చేనెల 10 వరకు భూ విస్తీర్ణం (తక్కువ నుంచి ఎక్కువకు) ప్రకారం ఆయా రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. జిల్లాలో మొత్తం పట్టాదారు రైతులు 1,59,956 మంది ఉండగా వీరికి రూ.172కోట్ల 99లక్షల 73వేల 379 రావాల్సి ఉంది. అయితే ఏఈవోలకు బ్యాంకు అకౌంట్, ఆధార్ వివరాలు ఇచ్చిన వారు 1,46,289 మాత్రమే ఉన్నారు. మరోవైపు 2023 జూన్ 18 వరకు పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులందరికీ రైతుబంధు అర్హులుగా గుర్తించి సంబంధిత పోర్టల్‌లో వారి పేర్లను నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ఇటు వర్షాలు.. అటు పెట్టుబడి సాయం

ఈ సారి నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా జిల్లాను తాకాయి. అయితే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తుండడంతో నాలుగు రోజులుగా సాగు పనులు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో రైతుబంధు సాయం వారికి కొంతమేర ఆసరా కానుంది. గతంలో మాదిరిగానే ఈ సారి కూడా తొలుత సన్న, చిన్నకారు రైతులకే ప్రాధాన్యమివ్వనున్నారు. మొదట అర, ఎకరంలోపు ఉన్న రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. విడుతల వారీగా పెంచుకుంటూ 15 రోజుల్లోపు రైతులందరి ఖాతాల్లో జమ కానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కొత్త పాస్‌బుక్ అందిన వారికి కూడా..

జిల్లాలో ఏటా పట్టాపాస్‌బుక్‌లు అందక అర్హులైన 5 నుంచి 10శాతం మందికి రైతుబంధు వర్తించడం లేదు. వ్యవసాయ భూమి ఉండి, రెవెన్యూ రికార్డుల్లో తప్పుగా నమోదు కావడం, ఇతర కారణాలతో సకాలంలో రికార్డుల్లోకి ఎక్కని వారికి సాయం అందడం లేదు. అలాంటి సమస్యలను రెవెన్యూ అధికారులు ధరణి వెబ్‌సైట్‌లో సరి చేశారు. ఈ సీజన్ నుంచి వారికి కూడా సాయం అందనున్నట్లు తెలుస్తోంది.

పదో విడత..

రాష్ట్ర ప్రభుత్వం రైతులను పంట సాగులో ప్రోత్సహించేందుకు పెట్టుబడి సాయం కింద 2018లో రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదట్లో వానాకాలం పెట్టుబడి సాయంగా ఎకరానికి రూ.4వేల చొప్పున చెక్కుల రూపంగా అందజేసింది. తదనంతరం యాసంగి నుంచి నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. 2019-20 వానాకాలం నుంచి ఎకరానికి రూ.5వేల చొప్పున పెంచింది. ఇప్పటి వరకు తొమ్మిది విడతల్లో రైతుకు పెట్టుబడి సాయం అందింది. ప్రస్తుతం పదో విడత షురూ కానుంది.

మండలాల వారీగా రైతుబంధు మంజూరు వివరాలు

మండలం	అర్హులైన రైతులు	జమకానున్న నగదు (రూ.లలో)
బెల్లంపల్లి	5292	6,38,31215
కాసిపేట	4,965	6,88,84,958
తాండూర్	7,357	10,07,64,539
భీమిని	6,957	12,42,36,203
కన్నెపల్లి	7,880	12,08,16,905
నెన్నెల	8,249	10,33,05,262
వేమనపల్లి	6,409	6,96,36,656
భీమారం	4,747	5,97,19,345
చెన్నూర్	14,446	16,72,13,306
జైపూర్	12,142	13,21,06,317
కోటపల్లి	11,712	14,30,50,722
మందమర్రి	5,597	7,02,74,321
దండేపల్లి	15,230	13,62,11,882
హాజీపూర్	8,052	7,44,57,067
జన్నారం	13,237	10,68,56,524
లక్సెట్టిపేట	12,364	10,56,23,654
మంచిర్యాల	866	78,56,508
నస్పూర్	787	69,13,956
మొత్తం	1,46,289	166,33,59,363

పఠనోత్సవం

- నేటి నుంచి 'రీడింగ్ క్యాంపెయిన్'
- జూలై 31 వరకు నిర్వహణ
- ఒకటి నుంచి పదో తరగతి వరకు..
- విద్యార్థులు ధారాళంగా చదివేలా చర్యలు



తరగతిగదిలో విద్యార్థులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పాఠ్యాంశాలు, దినపత్రికలు, ఇతర అంశాలు చదవడంలో చాలామంది విద్యార్థులు తడబడుతున్నారు. దీన్ని సరిదిద్దేందుకు పాఠశాల విద్యా శాఖ 'పఠనోత్సవం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 26 నుంచి జూలై 31 వరకు కార్యక్రమం కొనసాగనుంది. విద్యార్థులు ధారళంగా చదవడంతో పాటు నిత్యం చదవడం అలవాటుగా మార్చుకునేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుంది. అయితే చదువుపై విద్యార్థుల్లో ఏ మేరకు ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయులు చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే. గతంలో చేపట్టిన కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో ఫలితాలివ్వలేదు. ఈ కార్యక్రమమైనా సత్ఫలితాలు ఇచ్చేవిధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.

ప్రతీరోజు ఒక పీరియడ్

ఉమ్మడి జిల్లాలో డీఈవో పరిధిలోని పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. 35 రోజుల పాటు కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రతీ తరగతికి ప్రత్యేకంగా పఠన పీరియడ్ కేటాయించారు. విద్యార్థులందర్నీ ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేసి కఠిన పదాలు, సరళ పదాలు, బోర్డుపై రాసిన పదాలు, గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు, ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలు చదివించేలా చూస్తారు. ప్రతీరోజు ప్రార్థన సమయంలో విద్యార్థులు ఏదో ఒక అంశాన్ని చదివేలా చూడాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మూడు రోజులు మాతృభాషలో, రెండు రోజులు ఆంగ్లంలో, ఒకరోజు ద్వితీయ భాషలో చదివించేలా చర్యలు చేపట్టనున్నారు. పిల్లల్లో మరింత ఆసక్తి పెంచేందుకు కథల పుస్తకాలను చదివిస్తారు.

విద్యార్థులకు పోటీలు..

పఠనాసక్తిని పెంపొందించేందుకు విద్యార్థులకు వారానికి ఒకసారి పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులు చదువుతున్న తీరును వివరిస్తారు. దీంతో పాఠశాలల్లో ప్రజల భాగస్వామ్యం ఏర్పడుతుంది. ప్రతీ శనివారం విద్యార్థులకు పోటీలు నిర్వహించి వారి పఠన తీరును పర్యవేక్షిస్తారు. గ్రంథాలయంలో గల పుస్తకాలకు సంబంధించి విద్యార్థుల ద్వారా కమిటీలను ఏర్పాటు చేస్తారు. తోటి విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వడం, తీసుకోవడం, రికార్డులో రాయడం, తదితర వాటిని చేపడతారు.

వారోత్సవాల నిర్వహణ..

పఠనోత్సవంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని 2,924 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో గ్రంథాలయ వారోత్సవాలు చేపడుతున్నారు. జూలై 10 నుంచి ఆగస్టు 15 వరకు కార్యక్రమం కొనసాగించనున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కథల పుస్తకాలను చదివిస్తారు. దినపత్రికల్లో వచ్చిన మ్యాగ్జిన్‌లు, బొమ్మలను సేకరించి కార్టున్‌లను తయారు చేసేలా చూస్తారు. ఇందులో భాగంగా తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి కమిటీ పర్యవేక్షించనుంది.

ఉమ్మడి జిల్లాలో డీఈవో పరిధిలోని పాఠశాలల వివరాలు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
మంచిర్యాల	737	47,747
ఆదిలాబాద్	693	69,623
కుమురంభీం	747	65,365
నిర్మల్	747	55,749

పకడ్బందీగా అమలయ్యేనా?

కార్యక్రమం ఉద్దేశం మంచిదైనా చాలా మంది ఉపాధ్యాయులు వృత్తి నిబద్ధతతో పనిచేయకపోవడంతో గతంలో నిర్వహించిన కార్యక్రమాలు పూర్తిస్థాయిలో ఫలితాలు ఇవ్వలేదు. అభ్యసన, త్రీఆర్స్, తొలిమెట్టు, తదితర కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన స్థాయిలో జరగలేదు. అధికారుల పర్యవేక్షణ, కొంత మంది ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. ఈ కార్యక్రమాన్ని అయినా పకడ్బందీగా అమలు చేస్తే విద్యార్థులకు మేలు జరగనుంది.

పఠన సామర్థ్యం పెంచేలా..

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించేందుకు నేటి నుంచి జూలై 31 వరకు అన్ని పాఠశాలల్లో పఠనోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమం పకడ్బందీగా అమలయ్యేలా చూస్తాం. రాష్ట్రస్థాయి మానిటరింగ్ కమిటీలు పర్యవేక్షణ చేపడతాయి.

– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

అన్ని యూనియన్లను ఆహ్వానించాలి

- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు



మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహించేంత వరకు అన్ని సంఘాలను సమావేశాలకు ఆహ్వానించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లోని ఆ యూనియన్ కార్యాలయంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్ సమావేశం ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం, యజమాన్యం సుముఖంగా లేదన్నారు. అందుకే కోర్టుకు వెళ్లి జాప్యం అయ్యేలా చేశారన్నారు. ఎన్నికల నిర్వహించేంత వరకు కార్మికుల సమస్యలపై జరిగే సమావేశాలు, స్ట్రక్చర్ సమావేశాలు, సేఫ్టీ మైన్స్ కమిటీ సమావేశాలకు అన్ని యూనియన్లను ఆహ్వానించాలని కోరారు. దీనిపై లేబర్ కమిషనర్ సైతం ఇంతకు ముందు జరిగిన సమావేశాల్లో ఒప్పుకొని సంతకాలు చేసిన విషయాన్ని యజమాన్యం గుర్తుంచుకోవాలన్నారు. సింగరేణి కార్మికులకు రూ.700 కోట్ల లాభాలను పంచుతామని ముఖ్యమంత్రి కేసీఆర్ నస్పూర్ బహిరంగ సభలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్మికులకు వెంటనే ఆ లాభాల వాటా డబ్బులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, నాయకులు వై వెంకటేశ్వర్లు, కాంపాటి రాజయ్య, విజయ, శ్రీనివాస్, వెంకటస్వామి, అల్లి రాజేందర్, భాగ్యరాజ్, బాలాజీ, శ్రీనివాస్, కొమురయ్య చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మళ్లీ ప్రజావాణి

మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల సందర్భంగా ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి మూడు వారాల పాటు రద్దయిన విషయం తెలిసిందే. తిరిగి నేటి నుంచి షురూ కానుంది. నస్పూర్‌లోని నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, కలెక్టరేట్ పాలన అధికారులు అందుబాటులో ఉంటారని, సమస్యలపై దరఖాస్తు చేసుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీహబ్.. రెడీ

- ప్రారంభోత్సవానికి సిద్ధం
- ఏర్పాట్లలో అధికారులు బిజీ
- మంత్రి హరీశ్‌రావు వర్చువల్‌గా ప్రారంభించే అవకాశం
- పేదలకు అందుబాటులో 140 రకాల పరీక్షలు



పూర్తయిన తెలంగాణ డయాగ్నోస్టిక్ డిస్ట్రిక్ హబ్ కేంద్రం

మంచిర్యాలటౌన్: సర్కారు ఆసుపత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా అత్యాధునిక రోగ నిర్ధారణ పరీక్షలు సైతం ఉచితంగా అందించాలని భావిస్తోంది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో అధునాతన పరికరాలతో ఏర్పాటు చేసిన టీ-హబ్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈనెల 27, 28 తేదీల్లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వర్చువల్ పద్ధతిలో రాష్ట్రంలో కొత్తగా ఏ ర్పాటు చేసిన టీహబ్ కేంద్రాలను ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకవేళ ఆయా తే దీల్లో వీలు కాకుంటే, మరో తేదీని ప్రకటించి ఈ నె లాఖరులోనే పూర్తి చేసేలా సన్నద్ధమవుతున్నట్లు స మాచారం. మంత్రి వర్చువల్ పద్ధతిన ప్రారంభించి న వెంటనే స్థానిక ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు దీ నిని ప్రారంభించి అన్ని రకాల పరీక్షలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కేంద్రంలో రూపాయి ఖర్చు లేకుండా కేవలం ఆధార్‌తో 57ర కాల రక్త పరీక్షలతో పాటు ఇతరత్రా మొత్తం 140 ర కాల పరీక్షలు చేయనున్నారు. జిల్లాలోని 17 పీహెచ్‌సీలు, నాలుగు అర్బన్ హెల్త్‌సెంటర్లు, మూడు బస్తీ దవాఖానాలతో పాటు, పల్లె దవాఖానాలు, సీహెచ్‌సీలకు వచ్చే వారి నుంచి సేకరించిన శాంపిల్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసే వాహనాల ద్వారా టీహబ్‌కు చేరవేస్తారు. ఆయా రిపోర్టులను, శాంపిల్స్ సేకరణ సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్‌కు చేరవేస్తారు.

140 రకాల పరీక్షలు..

టీ-హబ్‌లో మొత్తం 140 రకాల పరీక్షలు చేయనున్నారు. ఇందులో డయాబెటిక్ వారికి 6 రకాలు, థైరాయిడ్ ప్రొఫైల్‌లో 3 రకాలు, లివర్ పనితీరులో 10, రేనల్ ఫంక్షన్ 3, లిపిడ్ ప్రొఫైల్ 8, సీరం ఎలక్ట్రోలైట్స్, ఇతరత్రా కలిపి 6, కంప్లీట్ బ్లడ్ పిక్చర్(సీపీబీ) 13, మైక్రోబయాలజీ 8 కలిపి మొత్తంగా 57 రకాల పరీక్షలు అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు మహిళలకు రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన మామోగ్రాఫ్, అల్ట్రాసౌండ్, ఈసీజీ, డిజిటల్ ఎక్స్‌రే, 2డీ ఎకో వంటి యంత్రాలతో చేసే పరీక్షలన్నీ కలిపి 140 వరకు ఉన్నాయి.

రూ.1.25కోట్లతో..

టీ హబ్‌ను జిల్లా కేంద్రంలో రూ.1.25 కోట్లతో రెండంతస్తుల్లో నిర్మించి 17 గదులను ఏర్పా టు చేశారు. ఇందులో మైక్రోబయాలజీ, బ యోకెమిస్ట్రీ ల్యాబ్, పాథాలజీ, డ్రైస్టోర్, కోల్డ్‌స్టోర్, కన్సల్టెంట్ రూం, 2డి ఎకో రూం, ఈ సీజీ రూం, యూఎస్‌జీ రూం, సీఆర్ రూం, సీ టీస్కాన్, ఎక్స్‌రే రూం, మమ్మోగ్రఫీ రూం త దితర గదులను ప్రత్యేకంగాఏర్పాటు చేశారు. 2డీ ఎకో పరికరం రావాల్సి ఉంది. రేడియాలజిస్టు వైద్యుడు, బయోకెమిస్ట్రీ వైద్యుల నియామకం చేపట్టాల్సి ఉంది. ఇతర ఆసుపత్రుల్లో పనిచేస్తున్న 9 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, ఇ ద్దరు రేడియాలజిస్టులను టీహబ్‌కు కేటాయించారు. ల్యాబ్ మేనేజర్‌తో పాటు, డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఇప్పటికే నియమించారు. అయితే ల్యాబ్ టెక్నీషియన్ల కొరత జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉండగా, కొందరిని ఇక్కడకు డిప్యూటేషన్‌పై తీసుకోవడంతో ఆయా ఆసుపత్రుల్లో ప్రభావం చూపనుంది.

ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు..



టీహబ్ నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశాం. అన్ని రకాల పరికరాలు బిగించడంతో పాటు వాటి తీరును పరిశీలిస్తున్నాం. ఈ నెల 27న మంత్రి చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించే అవకాశం ఉంది. అయితే తేదీ ఇంకా ఫైనల్ కాలేదు. టీ హబ్ అందుబాటులోకి వస్తే జిల్లాలోని ప్రజలకు రోగ నిర్ధారణ పరీక్షలన్నింటినీ ఉచితంగా చేసేందుకు అవకాశం ఉంటుంది.

– హరీశ్‌చందర్‌రెడ్డి, మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్



హెమటాలజీ ఎనలైజర్

అన్ని రకాల రక్త పరీక్షలను దీని ద్వారా చేస్తారు. ఈ పరీక్షలకు ప్రైవేట్‌లో రూ.200 నుంచి రూ.300 వరకు తీసుకుంటారు. టీహబ్ ద్వారా ఉచితంగా అందుతాయి.

క్యాగలేషన్ ఎన్‌లైజర్

ఈ పరికరం ద్వారా పీటీ, ఏపీటీటీ, డిడైమర్ వంటి టెస్టులతో పాటు, రక్తం గడ్డకట్టడం వంటి వాటిని గుర్తిస్తారు. ప్రైవేట్‌లో వీటికి రూ.500 నుంచి రూ.2 వేలకు పైగా వెచ్చించాల్సి ఉంటుంది.



మైక్రోబయాలజీ ఇంక్యుబేటర్



దీని ద్వారా మూత్ర, రక్త పరీక్షలు చేస్తారు. యూరిన్, బ్లడ్ కల్చర్ ప్రైవేట్‌లో చేయిస్తే రూ. వెయ్యికి పైగానే ఖర్చవుతుంది.

మెమోగ్రామ్...



మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ను ముందస్తుగా గుర్తించేందుకు నిర్వహించే పరీక్షలను ఈ యంత్రం ద్వారా చేస్తారు. దీని వ్యయం సుమారు రూ.22లక్షలు. ఈ పరీక్షలకు ప్రైవేట్‌లో అయితే రూ.3వేలకు పైగా తీసుకుంటారు.

డిజిటల్ ఎక్స్‌రే



అత్యాధునిక సాంకేతికతో కూడిన డిజిటల్ ఎక్స్‌రేను టీహబ్‌లో అందుబాటులో ఉంచారు. ఈ మిషన్ ద్వారా ఎక్స్‌రే తీసిన వెంటనే ఫిల్మ్‌ను మొబైల్‌కు పంపిస్తారు. ప్రైవేట్‌లో ఈ పరీక్షకు రూ.600కు పైగా వసూలు చేస్తారు.

బయోకెమిస్ట్రీ ఎనలైజర్



ఈ పరికరంతో 50 రకాల టెస్టులు చేయవచ్చు. ఇందులో కిడ్నీ ఫంక్షన్, లివర్ ఫంక్షన్, లిపిడ్ ప్రొఫైల్ వంటివి ఉంటాయి. ఒక్కో పరీక్షకు ప్రైవేట్‌లో రూ.700 పైగా ఖర్చు అవుతుంది.

హార్మోన్ ఎనలైజర్



ఈ యంత్రం ద్వారా అన్ని రకాల హార్మోన్ పరీక్షలు చేస్తారు. థైరాయిడ్ పరీక్షలకు ప్రైవేట్‌లో ఒక్కోదానికి రూ.400 వరకు వసూలు చేస్తారు.

క్లుప్తంగా

పంట పొలాల్లోని విద్యుత్ సర్వీస్ కేబుల్ చోరీ



కట్‌చేసిన సర్వీస్ కేబుల్ చూపిస్తున్న రైతులు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సారంగపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పలువురు రైతుల పంట పొలాల్లోని విద్యుత్ మీటర్ నుంచి బోర్ వరకు ఉన్న సర్వీస్ కేబుల్‌ను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి ఎత్తుకెళ్లారు. ఆదివారం ఎనిమిది మంది రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ విద్యుత్ స్తంభం నుంచి సుమారు 15మీటర్ల మేరకు సర్వీస్ కేబులు ఎత్తుకెళ్లారని తెలిపారు. అసలే పంటల సమయం కేబుల్ వైర్ చోరీకి గురికావడంతో చాలా ఇబ్బంది అవుతుందని, దొంగలను గుర్తించి ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: మంచిర్యాల పెద్దంపేట రైల్వే స్టేషన్‌ల మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి (45)మృతి చెందినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... గుర్తు తెలియని రైలు బండి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెంది ఉంటాడని, మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. కడుపుపైన పుట్టుమచ్చ, నలుపు కలర్ ప్యాంట్, మెరున్ కలర్ ఫుల్ షర్ట్ ఉందని తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నానని తెలిపారు. వివరాలకు 83285 12176 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమురంభీం జిల్లాల్లో నూతనంగా ఏర్పాటు కానున్న మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీవో గోపిచంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు ఆన్‌లైన్ mjptbcwreis.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రియల్ వ్యాపారిపై కత్తులతో దాడి

ఆదిలాబాద్‌టౌన్: రియల్ ఎస్టేట్ వ్యాపారులు మరో రియల్ వ్యాపారిపై కత్తులతో దాడికి పాల్పడిన ఘటన శనివారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై అంజమ్మ తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. ఖానాపూర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి జహీర్‌ఖాన్ జేకే ఇంతియాజ్ వద్ద మూడు ప్లాట్లు కొనుగోలు చేశాడు. ఆ ప్లాట్లను పట్టణానికి చెందిన పత్తి ముజ్జుకు విక్రయించాడు. కొన్ని డబ్బులు చెల్లించగా, మిగతావి చెల్లించాల్సి ఉంది. అయితే రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా రేపుమాపు అంటూ తిప్పుకుంటున్నాడు. శనివారం జహీర్‌ఖాన్ ఆయనకు ఫోన్‌చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేకుంటే ఫోర్‌పిట్ చేస్తానని తెలిపాడు. పత్తి ముజ్జు తన స్నేహితులు ఆదిల్, ఆబిద్, ఇస్మాయిల్, అతిఖ్, మరో నలుగురితో రాత్రి 10 గంటల సమయంలో జహీర్‌ఖాన్ ఇంటికెళ్లి ఆయనపై కత్తులతో దాడి చేశారు.

డ్రోన్‌తో మందు స్ప్రే

- ఎంతో సులువంటున్న శాస్త్రవేత్తలు
- తక్కువ సమయంలో పూర్తి
- కూలీల సమస్యకు చెక్
- రసాయనాల వృథా అరికట్టే వీలు...



రసాయన మందును స్ప్రే చేస్తున్న డ్రోన్



రాజేశ్వర్ నాయక్, ప్రధాన శాస్త్రవేత్త, కేవీకే బెల్లంపల్లి

బెల్లంపల్లి: వ్యవసాయ రంగంలో రోజురోజుకూ అనేక మార్పులు వస్తున్నాయి. యాంత్రీకరణ వైపు పంటల సాగు పద్ధతులు పురోగమిస్తున్నాయి. పంటల సాగులో తెగుళ్లు, చీడ పీడల సమస్య సర్వసాధారణం. వీటి నివారణకు క్రిమి, రసాయనిక మందులను విధిగా స్ప్రే చేయాలి. ఇందుకు కూలీల అవసరం ఎంతగానో ఉంటుంది. కూలీలు సకాలంలో లభించకపోవడంతో ఒక్కోసారి పంటలను నష్టపోవాల్సిన పరిస్థితి. కూలీల సమస్య, పంట నష్టాన్ని నివారించడానికి డ్రోన్ సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. డ్రోన్‌తో స్ప్రే చేయడంతో కూలీల సమస్య తీరడంతో పాటు తక్కువ శ్రమ మాత్రమే ఉంటుంది. పంట పెట్టుబడి ఖర్చును తగ్గించుకోవడానికి వీలవుతుంది. పత్తి, వరి, పెసర, శనగ, మొక్కజొన్న, కంది తక్కువ ఎత్తు పెరిగే తదితర రకాల పంటలలో డ్రోన్‌తో స్ప్రే చేయవచ్చు. డ్రోన్ సాయంతో మందులు పిచికారీ చేసే విధానాలను బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త ఎం.రాజేశ్వర్ నాయక్ వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

నిమిషాల్లోనే స్ప్రే....

సాధారణంగా కూలీలతో క్రిమి, రసాయనిక మందులను స్ప్రే చేయించడానికి రోజంతా సమయం పడుతుంది. డ్రోన్ సాయంతో మందును స్ప్రే చేయడం కేవలం నిమిషాల్లోనే పూర్తవుతుంది. పెద్దపెద్ద కమతాల్లోనూ సునాయసంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా మందును స్ప్రే చేసుకోవచ్చు. ఎకరం విస్తీర్ణంలో మందు స్ప్రే చేయడం కేవలం 15నిమిషాల వ్యవధిలోనే జరిగి పోతుంది.

పంట మొత్తం సమానంగా స్ప్రే...

హ్యాండ్ స్ప్రేయర్‌తో పంట మొత్తంగా సమాంతరంగా మందు స్ప్రే చేయడానికి వీలుండదు. పైగా పిచికారీ చేసే క్రమంలో మందు వృథా అయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయి. భూమిపై పడి దుర్వినియోగం అవుతోంది. అదనంగా మందును కొనుగోలు చేయాల్సి ఉంటుంది. డ్రోన్‌తో స్ప్రే చేయడంతో క్రిమి సంహారక మందు ఏమాత్రం దుబారా కాదు. పంటపై మాత్రమే పిచికారీ అవుతుంది. చీడ పీడల నివారణ తేలికవుతుంది. మందుల వాడకం కనిష్టంగా 15 శాతం నుంచి గరిష్టంగా 25శాతం వరకు తగ్గించుకునేందుకు అవకాశం కలుగుతుంది.

సమయం.. ఖర్చు ఆదాకు అవకాశం

పంటల సాగులో డ్రోన్ సాయంతో క్రిమి సంహారక మందును పిచికారీ చేయడానికి సాధ్యమైనంత వరకూ ఒకరిద్దరు మినహా కూలీల అవసరం ఉండదు. డ్రోన్ సిస్టం ఆపరేట్ చేయడానికి శిక్షణ తీసుకున్న వ్యక్తి, నీటిని అందించడానికి ఓ కూలీ మాత్రమే అవసరం అవుతారు. కూలీలతో అంతగా అవసరం లేకపోగా పొద్దంతా పంట పొలాల్లో, చేలల్లో ఉండాల్సిన అవసరం ఉండదు. కేవలం కొన్ని నిమిషాల్లోనే పనిని ముగించుకుని ఎంచక్కా సేద తీరవచ్చు.

హానికరమైన ప్రభావాలు ఉండవు...

చీడపీడలు, తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవడానికి హానికరమైన క్రిమి సంహారక మందును వినియోగించాల్సి ఉంటుంది. అంతటి హానికరమైన మందును హ్యాండ్ స్ప్రేయర్స్‌తో స్ప్రే చేయడంతో ఒక్కోసారి స్ప్రే చేసే వ్యక్తి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలు ఉంటాయి. అదే డ్రోన్ ద్వారా మందును స్ప్రే చేయడంతో దాదాపు 99శాతం హానికర ప్రభావాల నుంచి నియంత్రించుకోవచ్చు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటిస్తూ డ్రోన్‌ల వినియోగానికి రైతులు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

ఆరుద్ర పురుగుల ఆగమనం



నెన్నెల శివారులో కనిపించిన ఆరుద్ర పురుగులు

నెన్నెల/భీమారం: వ్యవసాయ పనులు మొదలు పెట్టేందుకు ఆరుద్రకార్తె అనుకూలమైంది. సంవత్సరంలో ఆరుద్రకార్తెలో మాత్రమే ఆరుద్ర పురుగు కనిపిస్తుంది. ఆరుద్ర కార్తెకు రైతులకు అవినాభావ సంబంధం ఉంది. చూడగానే ముద్దు వచ్చే రూపంతో నెన్నెల, భీమారం శివారులోని చేనుల్లో ఆదివారం ఆరుద్ర పురుగులు దర్శనమిచ్చాయి. ఈ నెల 23న ఆరుద్ర కార్తె ప్రారంభమైంది. ఈ పురుగులు ఆగమనాన్ని రైతులు శుభసూచికంగా భావిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సెలవు రోజు చేనుబాట



వాతావరణం చల్లబడింది. నాలుగు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. రైతులంతా చేనుబాట పట్టారు. ఒక్కసారిగా పత్తి విత్తనాలు వేసేందుకు కూలీలకు డిమాండ్ పెరిగింది. అదను దాటుతుందని ఇంటికి తాళం వేసి రైతు కుటుంబం సమేతంగా విత్తనాలను వేసే పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఆదివారం పాఠశాలలకు సెలువు కావడంతో చిన్నారులు సైతం వెంట వేసుకొని విత్తనాలు వేశారు. చిన్నారులు ఎంతో హుశారుగా తల్లిదండ్రులతో పోటీపడుతూ విత్తనాలు వేశారు.

– మంచిర్యాలఅగ్రికల్చర్

మహిళపై లైంగికదాడి..హత్య

- మద్యం మత్తులో కామాంధుల అఘాయిత్యం
- చంపి వ్యవసాయబావిలో పడేసి..
- ధనోరా శివారులో ఆలస్యంగా వెలుగులోకి..
- సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల్లో ఒకరి అరెస్టు
- ఉట్నూర్‌కు తరలింపు, డీఎస్పీ విచారణ



జంగుబాయి (ఫైల్)

ఇంద్రవెల్లి: ముగ్గురు కామంధులు మద్యం మత్తులో ఓ మహిళపై లైంగికదాడికి పాల్పడి ఆపై హత్య చేశారు. మృతదేహాన్ని వ్యవసాయ బావిలో పడేసిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. గుర్తుతెలియని మృతదేహాన్ని నేరడిగొండ మండలం చించోలి గ్రామానికి చెందిన కుడ్మేత జంగుబాయి (35)గా కుటుంబీకులు గుర్తించారు. తల్లి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ కుమారుడు కుడ్మేత భీంరావ్ ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై సునీల్, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. భర్త కుడ్మేత నారాయణ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబ పోషణ నిమిత్తం జంగుబాయి గ్రామ, వారసంతల్లో తిరుగుతూ భిక్షాటన చేస్తోంది. వారం క్రితం జంగుబాయి తల్లిగారిల్లు అయిన దనోరా(బి) గ్రామానికి వచ్చి ఈనెల 20న వెళ్లిపోయింది. బంధువులు కూడా ఆమె తన గ్రామానికి వెళ్లిపోయి ఉండవచ్చని అనుకున్నారు. కాగా, శనివారం దనోరా(బి) శివారులోని వ్యవసాయ బావిలో మహిళ మృతదేహం లభ్యమైంది. కాగా, పోలీసులు గ్రామ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీలను పరిశీలించారు. మంగళవారం రాత్రి 12 గంటల తర్వాత గ్రామపొలిమేరలో జంగుబాయిను గ్రామానికి చెందిన పసరే సంతోష్, సముక్‌రావ్ సంతోష్, షేక్ ఖదీర్‌లు రోడ్డు పక్కకు తీసుకెళ్లారు. లైంగికదాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. సీసీ ఫుటేజీల్లో గుర్తించిన నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసి ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో విచారిస్తున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. నిందితులను ఉరితీయాలని మృతురాలు బంధువులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు.



ఐటీడీఏ ఎదుట ధర్నాలో ఆదివాసీ నాయకులు



సముదాయిస్తున్న డీఎస్పీ నాగేందర్

నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఆదివాసీ సంఘాల డిమాండ్
- ఉట్నూర్ ఐటీడీఏ ఎదుట ధర్నా

ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లి మండలం ధనోర(బి) శివారులో ఆదివాసీ మహిళను లైంగిక దాడి చేసి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదివాసీల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట మృతురాలి కుటుంబీకులతో కలిసి నాయకులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గేడం గణేశ్ మాట్లాడుతూ ఆదివాసీ మహిళపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు లైంగిక దాడి చేసి హత్య చేసి బావిలో పడేశారన్నారు. నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుమారుడు భీంరావును ఆదుకోవాలన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న డీఎస్పీ నాగేందర్ అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. అనంతరం సంఘాల నాయకులు, కుటుంబీకులు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డిని కలిశారు. మృతురాలి కుమారుడికి చదువుతోపాటు అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్కబాపురావు, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ పుష్పరాణి, ఆదివాసీ సంఘాల నాయకులు సోయం లలిత, మర్సుకోల తిరుపతి, పెందూర్ దత్తు, కాత్లే పృథ్వీరాజ్, సునీల్ జాదవ్, సెడ్మకి భీంరావు తదితరులు పాల్గొన్నారు.

ఇక ‘సమీకృత’లో ప్రజావాణి

- నేటి నుంచి మొదలు..
- ఇక్కడైనా సమస్యలు తీరేనా..?
- ఏళ్ల తరబడి మండలాల్లో గ్రీవెన్స్
- ఫలితం లేక కలెక్టరేట్‌కు
- ప్రతీ సోమవారం ఫిర్యాదు చేసేందుకు వస్తున్న అర్జీదారులు
- అన్నిశాఖల సమక్షంలో నిర్వహించాలంటున్న ప్రజలు



కలెక్టర్‌కు దరఖాస్తు ఇస్తున్న బాధితురాలు (ఫైల్)



కలెక్టర్ చాంబర్ ఎదుటు అర్జీదారులు (ఫైల్)

మంచిర్యాలఅగ్రికల్చర్: నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోనైనా సమస్యలు తీరుతాయా అని అర్జీదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో అర్జీలు ఇస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ భవనంలోనైనా మార్పు ఉంటుందా.. సమస్యలు పరిష్కారం అయ్యేనా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ దరఖాస్తులు తీసుకోవడం, కలెక్టర్ ఇతర కార్యక్రమాల్లో ఉంటే అర్జీదారులు ఫిర్యాదుదారుల కౌంటర్‌లో అర్జీలు ఇచ్చి వెళ్లేవారు. ఇప్పటికైనా సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అధికారుల ఆధ్వర్యంలో నేటి నుంచి ప్రజావాణి నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

గతంలో వందల కిలోమీటర్ల దూరం వెళ్లి...

కలెక్టర్‌కు బాధ చెప్పుకునేందుకు 2016 సెప్టెంబర్ వరకూ ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు వందల కిలోమీటర్ల దూరం నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లి ప్రజావాణిలో సమస్యలను కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేవారు. తదనంతరం జిల్లాల ఆవిర్భావంతో 2016 అక్టోబర్ నుంచి తాత్కాలిక కలెక్టరేట్ భవనంలో ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహించారు. కలెక్టర్‌తో పాటుగా అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండేవారు. అయితే 2018లో జిల్లాకు వచ్చిన కలెక్టర్ భారతి హోళ్లికేరి సైతం సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకూ నిర్వహించారు. 2018–19 అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ప్రజావాణి రద్దు చేశారు. ఆ తర్వాత కొనసాగించగా 2021 కరోనా ఉధృతి నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించలేదు. కొన్ని నెలల అనంతరం కలెక్టర్ ఆదేశాలతో మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహిస్తున్నారు.

అక్కడ కాకనే ఇక్కడికీ..

గతంలో ప్రతీ సోమవారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, పలు శాఖల జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు ఒకే దగ్గర ఉండడం, కలెక్టర్ అప్పటికప్పుడు సమస్యపై చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తుండడంతో కొన్ని సమస్యలకు సత్వరమే పరిష్కారం లభించేది. మండలాల్లో స్థానికంగా నిర్వహింస్తున్న ప్రజావాణిలో అర్జీదారుల నుంచి స్పందన ఉండడం లేదు. కొన్ని మండలాల్లో ఒక్క అర్జీదారు కూడా రాక వెలవెల బోతున్నాయి. ఇప్పటికైనా ప్రజావాణి కలెక్టరేట్‌లో నిర్వహించి అన్ని శాఖల అధికారులు పాల్గొని అర్జీలు స్వీకరించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పశుపోషకులు.. జాగ్రత్త

- వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకే అవకాశం
- అప్రమత్తతతో కాపాడుకునే వీలు..



శ్రీనివాస్, పశు వైద్యాధికారి, కత్తెరసాల



గొర్రెల మంద

చెన్నూర్‌రూరల్: వర్షాకాలం ప్రారంభమైంది. పశువులకు అంటు వ్యాధులు త్వరగా సోకే అవకాశం లేకపోలేదు. పశువుల పోషకులు ముందు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని కత్తెరసాల పశువైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు.

పశువులకు సోకే వ్యాధులు.. నివారణ చర్యలు

గాలిపుండు (ఫుట్‌ర్యాడ్‌వ్యాధి): ప్రధానంగా వర్షాకాలంలో మేకలు, గొర్రెలు కుంటుతుంటాయి. దీంతో వాటికి వ్యాధి సోకినట్లు గుర్తించాలి. చిత్తడి నేలలో తిరిగినప్పుడు, వరికోతల సమయంలో ఇలాంటి వ్యాధులు ఎక్కువగా వస్తాయి. బ్యాక్టీరియాతో ఈ వ్యాధి సోకుతోంది. నేలలు చిత్తడిగా ఉన్న సమయంలో ఈ వ్యాధి ఎక్కువగా సోకే అవకాశాలున్నాయి. వ్యాధి సోకిన గొర్రెలు, మేకలు అన్నింటితో సమానంగా నడవలేకపోతుంటాయి. వ్యాధి తీవ్రమైతే గిట్టలు ఊడి పోయే అవకాశం ఉంది.

నివారణ: ముందుగా వ్యాధి సోకిన వాటిని గుర్తించి మంద నుంచి వేరు చేయాలి. ఆరోగ్యంగా ఉన్న వాటికి దూరంగా ఉంచడంతోనే మిగతా వాటికి వ్యాధి సోకకుండా ఉంటుంది. వ్యాధి సోకిన గొర్రెలకు చికిత్స అందిస్తూ చిత్తడి నేలలు, నీరు నిలిచే ప్రదేశాలు, వాటిపై వర్షం కురిసే అవకాశం లేని ప్రాంతాల్లోనే ఉంచాలి. వీటికి చికిత్స అందించి నయం అయిన తర్వాతనే మిగతా వాటితో పంపించాలి.

చికిత్స విధానం: వ్యాధి లక్షణాలు గుర్తించిన గొర్రె, మేకలను పశువైద్యుడి పర్యవేక్షణలో పెన్సిలిన్, నొప్పి నివారణ మందులు వాడించాలి. వ్యాధి సోకిన ప్రదేశాన్ని పది శాతం పార్మలిన్ కాపర్ సల్ఫేట్ ద్రావణంలో ముంచాలి.

నీలి నాలుక వ్యాధి (బ్లూటంగ్ డిసీజ్): ఈ వ్యాధిని మూతివాపు, మూతిపుండు, పూత రోగం తదితర పేర్లతో పిలుస్తుంటారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న గొర్రెల్లో నాలుక నీలి రంగులోకి మారడంతో ఈ వ్యాధి సోకినట్లు నిర్ధారిస్తారు. ఈ వ్యాధి వైరస్ వల్ల సోకుతుంది. దోమకాటు వలన ఈ క్రిములు శరీరంలోకి ప్రవేశించి వ్యాధిని విస్తరింపజేస్తాయి. వర్షాకాలం ఈ వ్యాధి విస్తరణకు అవకాశం ఉంది.

వ్యాధి లక్షణాలు: వ్యాధి సోకిన గొర్రెల్లో జ్వరం ఎక్కువగా ఉంటుంది. క్రమేపి జ్వరం ఉన్న గొర్రెలకు సొల్లు కారుతూ పెదవులు, చిగుళ్లు వాచి, పెదవులు లోపలి భాగం ఎర్రబడి చిన్న గుల్లలు ఏర్పడుతాయి. వ్యాధి తీవ్రంగా ఉంటే కాళ్లకు కూడా సోకే అవకాశం ఉంటుంది. గిట్టల మొదటి భాగం వాచి ఎర్రగా మారుతుంది. గొర్రెలు సరిగా నడవలేని స్థితికి చేరి మేసేందుకు ఇష్టపడవు. వ్యాధి తీవ్రత పెరిగినప్పుడు నాలుక నీలి రంగులోకి మారుతుంది. తీవ్ర అస్వస్థతకు చేరి మెడ నిలబెట్టలేకుండా అచేతన స్థితికి చేరుతుంది. వారం పాటు మేత మేయకపోవడంతో తీవ్ర అస్వస్థతకు చేరి కింద పడిపోయే అవకాశం ఉంటుంది.

నివారణ చర్యలు: వర్షాకాలంలో పరిసర ప్రాంతాల్లో ఈగలు, దోమలు వాటిని నిలిపే ప్రదేశంలో బురద లేకుండా చర్యలు చేపట్టాలి. రోజుకు రెండు సార్లు దోమల నివారణకు వేప ఆకుతో పొగపెట్టాలి.

చికిత్స: వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే పెంపకదారుడు పశువైద్యాధికారిని సంప్రదించాలి. యాంటీ బయోటిక్, నొప్పి నివారణ మందులు వినియోగంతో వ్యాధి సోకిన గొర్రెలు మృత్యువాత పడకుండా ఉంటాయి. నోటిలోని పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి జింక్ పౌడర్‌ను పుండ్లపై రుద్దాలి. గిట్టల మధ్య ఉన్న పుండుకు హిమాక్స్, లెమ్‌నెంట్ రకాల ఆయింట్‌మెంట్‌ను పుయాలి. అనంతరం పశువైద్యాధికారి సూచనలు, సలహాలు పాటిస్తేనే పశువులు వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోగలుగుతాం.

వైభవంగా శ్రీమల్లన్నస్వామి కల్యాణం



పెద్దపట్నం వేస్తున్న ఒగ్గు పూజారులు



ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న భక్తులు

- వేలాలలో భక్తుల సందడి
- పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాలు

జైపూర్: మండలంలో ప్రసిద్ధిగాంచిన వేలాల శ్రీ మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా తొలి ఏకాదశ సందర్భంగా శ్రీమల్లన్నస్వామి కల్యాణం జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా రెండ్రోజుల పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తొలిరోజున శ్రీ మల్లన్నస్వామి, కేతమ్మ, భ్రమరాంభికలకు పవిత్ర గోదారి నదిలో స్నానం చేయించారు. అనంతరం ఆదివారం ఉదయం ఆలయంలో గొల్లపూజారులు, ఒగ్గుపూజారులు సంప్రదాయబద్ధంగా పెద్దపట్నం వేసి శ్రీ మల్లన్నస్వామి, కేతమ్మ, భ్రమరాంభికలకు కనుల పండువగా కల్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణం వీక్షించడానికి పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులతో వేలాల సందడిగా మారింది. అనంతరం అగ్నిగుండాలు నిర్వహించగా మల్లన్న స్వామి భక్తులు నిప్పులపై నుంచి నడిచారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్యాగ శ్యామల లక్ష్మణ్, ఎంపీటీసీ రాజేశ్వరి రాజబాపు, ఉప సర్పంచ్ డేగ నగేశ్ పాల్గొన్నారు.

ఊరికి ఉపకారం

- సొంత ఖర్చుతో మంచినీటి బావి నిర్మాణం
- విశ్రాంత ఉపాధ్యాయుడి ఔదార్యం



తవ్వించిన బావి వద్ద రిటైర్డ్ టీచర్ ప్రకాష్‌రావు దంపతులు



మంచినీటి బావి వద్ద నీటితో గిరిజన మహిళలు

నెన్నెల: ఆకలితో అలమటించే సమయానికి బుక్కెడు అన్నం... దాహంతో ఉన్న వారికి గుక్కెడు నీరు అందిస్తే అంతకన్న మించిన సేవ, సాయం మరొకటి లేదు. ప్రార్థించే చేతులకన్న.. సాయం చేసే చేతులు మిన్న అనే నానుడిని మండలంలోని మైలారం గ్రామానికి చెందిన జెడ్పీఎస్ఎస్ రిటైర్డ్ టీచర్ దండనాయకుల ప్రకాష్‌రావు నిజం చేశారు. మైలారం గ్రామంలోని పెద్దవాడలోని బోరు పాడైంది. మిషన్ భగీరథ నల్లాల ద్వారా నీళ్లు రాక నీటి కోసం అల్లాడుతున్న గిరిజనుల బాధలు చూసి సొంత ఖర్చులతో బావి తవ్వించాడు. సమాజం మనకు ఏమి ఇచ్చిందనేది కాదని, మనం సమాజానికి ఏమిచ్చామనేదే ముఖ్యం అంటున్నారని ప్రకాశ్‌రావు. మా నాన్న సుగుణాకర్‌రావు ప్రధానోపాధ్యాయుడిగా నెన్నెల హైస్కూల్‌లోనే విద్యను బోధించారని, ఆయన సైతం గిరిజనుల కోసం మైలారంలోని చిన్నవాడలో బావి తవ్వించారని, తండ్రిని స్ఫూర్తిగా తీసుకుని ఊరి కోసం తనకు తోచిన విధంగా బావి తవ్వించినట్లు చెబుతున్నాడు. ఇలాంటి సేవలు మరిన్ని చేయాలని స్థానికులంటున్నారు.